క్లుప్తంగా

వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ

కేతేపల్లి : ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు వృత్తి విద్యా కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పించనున్నట్లు ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ వంటిపాక సంధ్య తెలిపారు. కేతేపల్లిలో శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. అర్హులైన అభ్యర్థులకు నర్సింగ్, ఎలక్ట్రీషియన్, బ్యూటీషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, మెకానికల్, డేటా ఎంట్రీ ఆపరేటర్ తదితర కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇవ్వడంతో పాటు శిక్షణ సమయంలో ఉచిత హాస్టల్, భోజన వసతి కల్పించనున్నట్లు చెప్పారు. హైదరాబాద్‌లోని మూడు కేంద్రాలతో పాటు షాద్‌నగర్‌లోని శిక్షణ కేంద్రంలో 45 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 76740 41633 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నల్లగొండ : నల్లగొండలో 11 కేవీ లైన్ షిఫ్ట్, రోడ్డు విస్తరణ పనుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ ఏడీఈ వేణుగోపాలాచార్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మిర్యాలగూడ రోడ్డు, బీటీఎస్, శ్యామ్‌నగర్, భారత్ గ్యాస్ ఏరియా, దారుపాష కాలనీల్లో విద్యుత్ సరఫరాలకు అంతరాయం ఏర్పడుతుందని వెల్లడించారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీ

రామగిరి (నల్లగొండ) : వరల్డ్ మెంటల్ హెల్త్ అవేర్‌నెస్ డే సందర్భంగా శుక్రవారం స్థానిక ఎన్జీ కళాశాల విద్యార్థులకు 'ది ఇంపాక్ట్ ఆఫ్ సోషల్ మీడియా ఆన్ స్టూడెంట్స్ మెంటల్ హెల్త్' అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఈ పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, తెలుగు విభాగం ఇన్‌చార్జి డాక్టర్ వెల్దండి శ్రీధర్, అధ్యాపకులు గోవర్ధనగిరి, లింగస్వామి, శ్రవణ్ పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించాలి

నల్లగొండ: జిల్లాలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్స్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ శాఖ డీడీ శశికళకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యుడు ఖమ్మంపాటి శంకర్, నల్లగొండ జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ మాట్లాడుతూ.. విద్యార్థులకు కనీసం నోట్‌బుక్స్, దుప్పట్లు ఇప్పటి వరకు అందలేదని అన్నారు. అదేవిధంగా కాస్మోటిక్ చార్జీలు పెంచాలని కోరారు. సమస్యలను పరిష్కరించకపోతే ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

నల్లగొండ టౌన్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని నిరసిస్తూ ఈ నెల 13న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, ఎంజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గాదె రమేష్ కోరారు. ఈ మేరకు శుక్రవారం నల్లగొండలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. అదేవిధంగా 17న మండల రెవెన్యూ కార్యాలయాల ఎదుట ధర్నాను, 22న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బకరం శ్రీనివాస్, మేడి శంకర్, పోలేని యాదయ్య, ఏడుకొండలు, దేవయ్య పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం



విజేతలతో డీఎస్పీ శివరాంరెడ్డి

నల్లగొండ టూటౌన్: నల్లగొండ పట్టణంలో శుక్రవారం అండర్-17 బాలబాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభమయ్యాయి. విజేతలకు నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ దగ్గుపాటి విమల, పీడీలు అస్రఫ్ అహ్మద్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, గఫార్, రఘు, కోచ్ పి.ఖ్యాతి పాల్గొన్నారు.

దెబ్బతిన్న రోడ్ల పరిశీలన

నార్కట్‌పల్లి : ఇటీవల కురిసిన వర్షాలకు ఏపీ లింగోటం గ్రామ చెరువు అలుగు పారుతోంది. భారీ వరదతో లింగోటం నుంచి పోతనేని పల్లె వెళ్లే రోడ్డు పూర్తిగా కొట్టుకుపోయింది. ఈ మార్గంలోనే ఐకేపీ కేంద్రం ఉండటంతో రైతులు, గ్రామ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక లింగోటం-పరడ మార్గంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. దారి పూర్తిగా కొట్టుకుపోయింది. దీంతో రైతులు పొలాలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విషయం తెలుసుకున్న గ్రామ కాంగ్రెస్ నాయకులు గడ్డం పశుపతి తదితరులు రైతులతో కలిసి దెబ్బతిన్న రోడ్లను శుక్రవారం పరిశీలించారు. ఈ విషయాన్ని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాంగోపాల్‌రెడ్డి, గద్దగూటి యాదగిరి, తండ సైదులు, ఎం.కల్యాణ్, నరేష్ పాల్గొన్నారు.

అండర్ పాస్ వంతెన నిర్మాణం జరిగేనా!

- నకిరేకల్ శివారులో ప్రమాదకరంగా పద్మానగర్ జంక్షన్
- నిత్యం చోటుచేసుకుంటున్న ప్రమాదాలు



నకిరేకల్ శివారులో ప్రమాదకరంగా ఉన్న పద్మానగర్ జంక్షన్

నకిరేకల్ : హైవేలపై ప్రమాదకరంగా ఉన్న జంక్షన్ల వద్ద అండర్ పాస్ వంతెనల నిర్మాణాలు, సర్వీస్ రోడ్ల ఏర్పాటుకు కృషి చేస్తామని ప్రజాప్రతినిధులు, అధికారులు ఇస్తున్న హామీలు అమలుకు నోచుకోవడం లేదు. దీంతో నిత్యం ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. నకిరేకల్ పట్టణ శివారులోని పద్మానగర్ జంక్షన్ వద్ద నిత్యం రోడ్డు దాటుతూ ఎందరో గాయాల పాలవడంతో పాటు మృత్యువాత పడుతున్న సంఘటనలు కూడా ఉన్నాయి. అయితే పాలకులు మాత్రం ఈ సమస్యకు పరిష్కారం చూపడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం పద్మానగర్ జంక్షన్ వద్ద నకిరేకల్‌కు చెందిన ఇద్దరు యువకులు బైక్‌పై రోడ్డు దాటుతున్న క్రమంలో హైదరాబాద్ నుంచి విజయవాడ వైపునకు వెళ్తున్న ట్యాంకర్ లారీ ఢీకొట్టడంతో ఒక యువకుడు అక్కడికక్కడే మృతిచెందగా, మరో యువకుడు తీవ్ర గాయాల పాలయ్యాడు. ఈ జంక్షన్ వద్ద ప్రజలు ప్రాణాలు అరచేతిలో పట్టుకొని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు. ఇక్కడ అండర్ పాస్ వంతెన నిర్మించి ప్రమాదాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

కలగానే అండర్ పాస్ వంతెన

హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి గుండా నిత్యం 50 వేలపైనే వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయితే, పలుచోట్ల ప్రధాన జంక్షన్ల వద్ద అండర్ పాస్ వంతెనలు నిర్మించడం మరిచారు. నకిరేకల్ నియోజకవర్గంలోని నకిరేకల్, కేతేపల్లి, కట్టంగూరు, నార్కట్‌పల్లి, చిట్యాల మండలాల మీదుగా 65 కిలోమీటర్ల మేర హైవే విస్తరించి ఉంది. నకిరేకల్ శివారులోని పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించాలని ఆ ప్రాంతవాసులు విన్నవిస్తున్నా అడుగు ముందుకు పడటం లేదు. హైవే నిర్మాణ సమయంలోనే ఇక్కడ అండర్ పాస్ నిర్మించకపోవడంతో జంక్షన్ ప్రమాదకరంగా మారింది. నకిరేకల్ నుంచి హైదరాబాద్, నల్లగొండ వైపునకు వెళ్లాలంటే ఈ జంక్షన్ దాటాల్సి ఉంది. జంక్షన్ దాటే క్రమంలో హైదరాబాద్-విజయవాడ హైవేపై అతి వేగంగా వెళ్లే వాహనాలు ఢీకొని ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. నకిరేకల్‌లోని పద్మానగర్ వద్ద గత రెండేళ్లలో 15 మందికి పైగా ప్రాణాలు కోల్పోగా, 40 మందికి పైగా గాయాల పాలయ్యారు. ప్రత్యేకించి ఈ జంక్షన్ పక్కనే పద్మానగర్ కాలనీ ఉంది. ఈ కాలనీవాసులు రాత్రివేళలో జాతీయ రహదారి కూడలి దాటి నకిరేకల్ పట్టణానికి రావాలంటే భయాందోళనకు గురవుతున్నారు.

ప్రమాదాలను అరికట్టాలి



పద్మానగర్ జంక్షన్ వద్ద అండర్ పాస్ వంతెన నిర్మించాలి. రోడ్డు దాటాలంటేనే భయంగా ఉంది. అధికారులు స్పందించి ప్రమాదాలను అరికట్టేందుకు కృషి చేయాలి.

– చిట్టిప్రోలు యాదగిరి, పద్మానగర్, నకిరేకల్

కిశోర బాలికలు పోషకాహారం తీసుకోవాలి

కేతేపల్లి : కిశోర బాలికలు రక్తహీనత బారినపడకుండా పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు సూచించారు. ఐసీడీఎస్ ఆధర్యంలో కేతేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు, పోషకాలు కలిగిన ఆహార పదార్థాలు, లింగ వివక్ష, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం బాలికా సాధికారికతపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.రఘు, హెల్త్ సూపర్‌వైజర్ రోజ, చైల్డ్ హెల్ప్‌లైన్ ఝాన్సీ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కళావతి తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

మర్రిగూడ : విద్యార్థినులు ప్రతిరోజు పోషకాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద అన్నారు. పోషణ మాసోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యార్థినులకు పోషకాహారం, రక్తహీనతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు ప్రతిరోజు చిరుధాన్యాలు, పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మాంసం వంటివి తీసుకోవడం వల్ల రక్తహీనత సమస్యకు దూరంగా ఉండొచ్చని తెలిపారు. అదేవిధంగా పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై వివరించారు. అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, కేజీబీవీ ఎస్‌ఓ జ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నకిరేకల్ : నకిరేకల్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు న్యూట్రిషన్, బాల్య వివాహలపై వ్యాస రచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి అస్రా అంజుమ్, సూపర్‌వైజర్లు సునీత, భవాని, జ్యోతి, అంగన్‌వాడీ టీచర్ సుజాత పాల్గొన్నారు.



కేతేపల్లి : ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు, అధికారులు

ఉపాధ్యాయులకు శిక్షణ

తిప్పర్తి : విద్యార్థులు ఆన్‌లైన్ విద్యలో రాణించడానికి, వారికి కంప్యూటర్ పరిజ్ఞానం కల్పించడానికి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు నిర్వహించినట్లు మండల విద్యాధికారి నర్సింహనాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. శిక్షణలో భాగంగా డేటా, మిషన్ లెర్నింగ్, కోడింగ్ తదితర కంప్యూటర్ పరిజ్ఞానంపై మండలంలోని మ్యాథ్స్, ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలి



కేతేపల్లి : కేజీబీవీ విద్యార్థినులతో కలిసి భోజనం చేస్తున్న మండల ప్రత్యేక అధికారి గోపికృష్ణ

కేతేపల్లి : మండలంలోని చెర్కుపల్లి గ్రామంలో ఉన్న కేజీబీవీని సివిల్ సప్లై డీఎం, మండల ప్రత్యేక అధికారి గోపికృష్ణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలు, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. వంట చేసే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ ఎ.రాజేంద్రప్రసాద్, పాఠశాల స్పెషల్ ఆఫీసర్ ఎం.వసంత, సీఆర్పీ కె.మహేందర్ పాల్గొన్నారు.

వసతి గృహాలను సందర్శించిన మండల ప్రత్యేకాధికారి

నకిరేకల్ : ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు సరిపోను నాణ్యమైన ఆహారం అందించాలని మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ సూచించారు. నకిరేకల్ పట్టణంలోని వివిధ ప్రభుత్వ వసతి గృహాలను శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రతి వారం వసతి గృహాల్లోవైద్య శిబిరాలు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని చెక్ చేయాలని చెప్పారు. కార్యక్రమంలో ఎస్సీ వసతి గృహం వార్డెన్ యాదగిరి పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతోనే ఆరోగ్యం



నల్లగొండలో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ గవర్నర్ మదన్‌మోహన్

రామగిరి (నల్లగొండ) : మానసిక ప్రశాంతతోనే మెరుగైన ఆరోగ్యం సాధ్యమని లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ రేపాల మదన్‌మోహన్ అన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్, వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్జీ కళాశాలలో నిర్వహించిన మెగా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆరోగ్యం కోసం వ్యాయామం చేయడం, మంచి ఆహారం తీసుకోవడంతో పాటు మనసును కూడా ప్రశాంతంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బండారు ప్రసాద్, కో ఆర్డినేటర్ బాచుపల్లి రవీందర్ రావు, ఉప గవర్నర్ లయన్ కేవీ.ప్రసాద్, జిల్లా రెండో ఉప గవర్నర్ సతీష్‌కుమార్ కోడె, నిమ్మల పిచ్చయ్య, అశోక్ ఎర్రమాద, ఆనందపు ఆదినారాయణ, ఊరుకొండ ప్రభాకర్‌రెడ్డి, ఏదుల అంజిరెడ్డి, డాక్టర్ ఏసీహెచ్.పుల్లారావు, డాక్టర్ హరినాథ్ కడిమి, డాక్టర్ రాజిరెడ్డి, డాక్టర్ సుబ్బారావు, బి.సత్యనారాయణరెడ్డి, మామిడి పద్మ, బండారు పుష్ప, యాస సరళ, కోట సరిత, జిల్లా ఇందిరా, పుట్టా వెంకన్న, జిల్లా దశరథ, బండారు రామలింగం, మారబోయిన చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కట్టంగూర్‌లో..

కట్టంగూర్ : ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని లయన్స్ క్లబ్ కట్టంగూర్ కింగ్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ అంబటి అంజయ్య పాల్గొని మాట్లాడారు. మానసిక ఆరోగ్యం కాపాడుకునేందుకు నిత్యం పాజిటివ్ ఆలోచనలు కలిగి ఉండటంతో పాటు వ్యాయామం, ధ్యానం చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రెడ్డిపల్లి సాగర్, ప్రధాన కార్యదర్శి గుడిపాటి శివ, సహాయ కార్యదర్శి బసవోజు వినోద్, మంగదుడ్ల శ్రీనివాస్, రాపోలు వెంకటేశ్వర్లు, కడవేరు మల్లికార్జున్, ఉపాధ్యాయులు కొంక ఆంటోని, విఠల్, అబ్దుల్ గఫార్, చిన్ని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాజ్యాంగంలోని ఆర్టికల్స్ చదవాలి

నల్లగొండ : భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 నుంచి 38 వరకు ప్రతి ఒక్కరూ చదవాలని మాజీ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. నల్లగొండలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆ సంఘం పూర్వ అధ్యక్షుడు నాగటి నారాయణ వర్ధంతి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఉపాధ్యాయులు టెట్ అర్హత సాధించాలని చెప్పడం సరికాదని, ప్రభుత్వం విద్యాహక్కు చట్టంలో సవరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎం.రాజశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశం, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎడ్ల సైదులు, అంజిరెడ్డి, తెలుగు విజ్ఞాన వేదిక అధ్యక్షుడు రాఫెల్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి దామోదర్‌రెడ్డికి నివాళి

శాలిగౌరారం : కాంగ్రెస్ పార్టీకి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి చేసిన సేవలు మరువలేనివని డీసీసీ ఉపాధ్యక్షుడు అన్నెబోయిన సుధాకర్ అన్నారు. శుక్రవారం తుంగతుర్తిలో దామోదర్‌రెడ్డికి చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన వెంట యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బొల్లికొండ గణేశ్, మాజీ వైస్ ఎంపీపీ భూపతి అంజయ్య, మండల నాయకులు బెల్లి వీరభద్రం, నిమ్మల కృష్ణమూర్తి, పెరుమాండ్ల నరేశ్, బోడ విజయ్, షేక్ ఇబ్రహీం, కుర్ర లింగయ్య, గుండె కిశోర్, కడారి అంజయ్య, బండారు హన్మంతు, కంది మహేశ్, యాదగిరి, సైదులు, జానయ్య, రామలింగయ్య, విజయ్‌కుమార్, ఊశయ్య తదితరులు ఉన్నారు.

ఉపాధి కూలీలు ఈ కేవైసీ చేయించుకోవాలి

నాంపల్లి : ఉపాధి హామీ కూలీలు ఈ కేవైసీ చేయించుకోవాలని నాంపల్లి గ్రామ కార్యదర్శి బుర్రి శ్రీనివాస్ సూచించారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో శుక్రవారం ఉపాధి హామీ కూలీలతో కార్యదర్శి, ఉపాధి హామీ సిబ్బంది ఈ కేవైసీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీల జాబ్ కార్డు, ఆధార్ కార్డుతో ఈ కేవైసీ చేయనున్నట్లు తెలిపారు.

పత్తి, వరి చేల పరిశీలన

మర్రిగూడ : మండలంలోని కొండూరు, యరగండ్లపల్లి, తిరగండ్లపల్లి గ్రామాల్లో సాగు చేసిన పత్తి, వరి చేలను శుక్రవారం మునుగోడు సహాయ వ్యవసాయ సంచాలకుడు బి.వేణుగోపాల్, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించారు. పత్తిలో ఆకుమాడు తెగులు, ఎండు తెగులును గుర్తించి వాటి నివారణపై రైతులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ఎస్.లింగయ్య, కేవీకే ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కె.చంద్రశేఖర్, ప్లాంట్ పెథాలజిస్ట్ డాక్టర్ దివ్యరాణి, ఏఓ ఎం.సాహస్, ఏఈఓలు నాగస్వాతి, శ్రీలత, రైతులు పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఎల్‌ఓసీ అందజేత

శాలిగౌరారం : మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన పానుగంటి జాని కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. జానీది నిరుపేద కుటుంబం కావడంతో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈ విషయాన్ని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ దృష్టికి తీసుకెళ్లగా వారు స్పందించి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.లక్ష మంజూరు చేశారు. దీంతో గ్రామానికి చెందిన నాయకులు గుత్త రవీందర్‌రెడ్డి, కప్పల శ్రీనివాసులు శుక్రవారం నిమ్స్ ఆస్పత్రిలో జానికి ఎల్‌ఓసీ అందజేశారు.

'బీసీలను మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వం'

నకిరేకల్ : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేసిందని బీజేపీ మండల అధ్యక్షుడు బుడిగె సైదులు ఆరోపించారు. నకిరేకల్‌లో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీసీలను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని అన్నారు.

తహసీల్దార్ అవినీతిపై విచారణ జరపాలి

చిట్యాల : చిట్యాల తహసీల్దార్ అవినీతిపై పూర్తిస్థాయి విచారణ జరపాలని పీఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకటస్వామి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ న్యాయపరంగా పరిష్కారం కావాల్సిన భూ సమస్యలను పరిష్కరించకుండా తహసీల్దార్ అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. ఆయన వెంట బి.సంజీవ, కూరాకుల సురేష్, మహంకాళి శ్రీనివాస్, జిట్ట రమేష్, జోగు శేఖర్, పాల చిన్న నర్సింహ, చింత శ్యామ్, కోళ్ల శివ తదితరులు ఉన్నారు.

బీసీలకు రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే..



నల్లగొండ టౌన్: కళాశాల బంద్ చేయించి నినాదాలు చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్: బీసీల 42 శాతం రిజర్వేషన్లపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ శుక్రవారం నల్లగొండలోని క్లాక్‌టవర్ వద్ద బీసీ సంక్షేమ సంఘం నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రభుత్వం జారీ చేసిన జీఓపై హైకోర్టు స్టే ఇవ్వడం బాధ కలిగించిందన్నారు. బీసీ రిజర్వేషన్లను జీర్ణించుకోలేని కొన్ని అగ్రవర్ణ శక్తులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని, వారి కుట్రలు తిప్పికొడతామని అన్నారు. బీసీలకు విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ, మిర్యాల యాదగిరి, చొల్లేటి ప్రభాకర్, వైద్యుల సత్యనారాయణ, నల్లసోమ మల్లయ్య, గుండు వెంకటేశ్వర్లు, ఇంద్రయ్య, పుట్ట వెంకన్నగౌడ్, కారింగుల యాదగిరి, సింగం లక్ష్మీనారాయణ, శంకర్, మునాస ప్రసన్నకుమార్, జనార్దన్‌గౌడ్, ఆడెం తిరుపతయ్యగౌడ్, మధుయాదవ్, సాయిబాబా, భరత్, జిల్లా నారాయణ, గంజి భిక్షమయ్య, వి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్

రిజర్వేషన్ల అంశంపై హైకోర్టు స్టే విధించడాన్ని నిరసిస్తూ బీసీ విద్యార్థి సంఘం ఆధర్యంలో శుక్రవారం పట్టణంలో విద్యా సంస్థలను బంద్ చేయించారు. రైల్వే ట్రాక్ వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్‌గౌడ్, కారింగ్ నగేష్, పొగాకు రవికుమార్, రాజ్‌కుమార్, శ్రీకాంత్, తరుణ్, రామన్నగౌడ్, సాయిశివ, ప్రమోద్, మహేష్, నాగరాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో..

బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో విద్యా సంస్థలను బంద్ చేయించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీసీ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కట్టెకోలు దీపేందర్, గొల్ల నాగరాజు, శివకుమార్, రవి, సాయి, రవివర్మ, శంకర్, రమేష్, వెంకటేష్, మురళి, లింగస్వామి, విజయ్ పాల్గొన్నారు.

కనగల్‌లో..

కనగల్ : బీసీ సంఘం ఆధ్వర్యంలో కనగల్‌లో నిరసన తెలిపారు. విద్యా సంస్థలను మూసి వేయించారు. బీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సింగం లక్ష్మీనారాయణ, సింగం నాగరాజు, బీమానగోని నవీన్, సింగం రవి, చిత్రం సాయి పాల్గొన్నారు.

మునుగోడులో..



మునుగోడులో నిరసన వ్యక్తం చేస్తున్న బీసీ సంఘం నాయకులు

మునుగోడు : బీసీ సంక్షేమ సంఘం పిలుపు మేరకు మునుగోడులో ఆ సంఘం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు బూడిద లింగయ్య యాదవ్, మండల అధ్యక్షుడు గుంటోజు వెంకటాచారి, నాయకులు బూడిద మల్లికార్జున్ యాదవ్, ఆనంగిరి కృష్ణ, మిర్యాల వెంకన్న, మాలిగ యాదయ్య, బోడ్డు నాగరాజు గౌడ్, జిట్టగొని యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీలు మేల్కొనాలి

నల్లగొండ టౌన్: బీసీలంతా మేల్కొని రిజర్వేషన్లను సాధించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు సీహెచ్.సతీష్ కుమార్ అన్నారు. నల్లగొండలోని బీపీ మండల్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లను అడ్డుకుంటున్న ఆధిపత్య కులాలను రాజకీయంగా తరిమివేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కల్లూరి సత్యనారాయణ గౌడ్, కొత్త లింగస్వామి, వెంపటి నరసింహ, దొండ సాంబయ్య, సైదులు, యాదయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ఆటంకం

నల్లగొండ టౌన్: బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్ర ప్రభుత్వం ఆటంకం కలిగించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సయ్యద్ హాశం ఆరోపించారు. నల్లగొండలో శుక్రవారం నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చర్చ పెట్టిందని, ఆ సమయంలో అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయని గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదంతో బిల్లును రాష్ట్రపతి, గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వం పంపించిందని, అక్కడ బిల్లు ఆమోదించకుండా కేంద్రం కావాలనే కాలయాపన చేస్తుందని ఆరోపించారు. కుంభం కృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎండీ సలీం, దండంపల్లి సత్తయ్య, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, గాదే నరసింహ, పాక లింగయ్య, అద్దంకి నరసింహ, ఊట్కూరి మధుసూదన్‌రెడ్డి, గుండాల నరేష్, కన్నెకంటి సత్యనారాయణ పాల్గొన్నారు.

పార్టీ దిమ్మెలకు బతుకమ్మ చీరల తొలగింపు



పార్టీ దిమ్మెలకు పరదాలు చుట్టిన దృశ్యం

నకిరేకల్ : స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో భాగంగా మండలంలోని మంగళపల్లి గ్రామ ప్రధాన కూడలిలో ఉన్న వివిధ పార్టీల దిమ్మెలకు అధికారులు బతుకమ్మ చీరలను చుట్టారు. ఈ విషయమై శుక్రవారం సాక్షి దినపత్రికలో 'పార్టీ దిమ్మెలకు బతుకమ్మ చీరలు' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి స్పందించిన పంచాయతీ అధికారులు వాటిని తొలగించి పరదాలతో కప్పారు. దీంతో గ్రామంలోని అన్ని పార్టీల దిమ్మెలు, స్మారక స్థూపాలు కొత్తగా చుట్టిన పరదాలతో దర్శనమిస్తున్నాయి.

సాక్షి ఎఫెక్ట్..

డంపింగ్ యార్డు పరిశీలన

తిప్పర్తి : మండల కేంద్రంలోని డంపింగ్ యార్డును జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డులో వర్షపు నీరు చేరిందన్న సమాచారంతో పరిశీలించినట్లు తెలిపారు. ఇటీవల విస్తృతంగా కురిసిన వర్షాలకు డిస్ట్రిబ్యూటరీ కాల్వల నీటితో పాటు వర్షపు నీరు డంపింగ్ యార్డులో చేరిందని, దీంతో డంపింగ్ యార్డును మరో స్థలంలోకి మార్చాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఎంపీఓ జానయ్య, కార్యదర్శి నర్సింహస్వామి తదితరులు పాల్గొన్నారు.



డంపింగ్ యార్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి వెంకయ్య

మహాసభను జయప్రదం చేయాలి



మహాసభల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

నల్లగొండ టూటౌన్ : నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో ఈ నెల 12వ తేదీన నిర్వహించనున్న మున్సిపల్ వర్కర్స్ ఐదో మహాసభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ కౌన్సిలర్ ఎండీ.సలీం కోరారు. ఈ మేరకు శుక్రవారం తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ మహాసభ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. జిల్లాలోని ఎనిమిది మున్సిపాలిటీల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు చేయాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దండెంపల్లి సత్తయ్య, పట్టణ కన్వీనర్ అవుట రవీందర్, యూనియన్ పట్టణ కార్యదర్శి పెరిక కృష్ణ, పేర్ల సంజీవ, పందుల లింగయ్య, తీగల ఎల్లమ్మ, యాదయ్య, జానమ్మ పాల్గొన్నారు.

పాఠశాలకు సౌండ్ సిస్టం బహూకరణ



పాఠశాల హెచ్‌ఎం యాదగిరికి సౌండ్ సిస్టమ్‌ను అందజేస్తున్న కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్

కట్టంగూర్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ చేయూత ఇస్తుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ కస్తూరి శ్రీచరణ్ అన్నారు. మండలంలోని ఎరసానిగూడెం ప్రాథమికోన్నత పాఠశాలకు శుక్రవారం కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.25 వేలు విలువ చేసే సౌండ్ సిస్టమ్, జాతీయ నాయకుల చిత్రపటాలను బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం యాదగిరి, ఉపాధ్యాయులు తరాల పరమేష్‌యాదవ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంలో డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న హరిప్రసాద్

నల్లగొండ టూటౌన్ : దేవరకొండకు చెందిన పులిజాల హరిప్రసాద్ రసాయన శాస్త్రంలో చేసిన పరిశోధనకు గాను మహాత్మాగాంధీ యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఎంజీయూ రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డాక్టర్ వై.ప్రశాంతి పర్యవేక్షణలో 'సింథసిస్ క్యాటలిటిక్ అండ్ బయలాజికల్ అప్లికేషన్స్ ఆఫ్ మెటల్ ఆర్గానిక్ ఫ్రేమ్ వర్క్స్' అనే అంశంపై పరిశోధనా పత్రాన్ని సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు, కోచ్

మునుగోడు : నిజామాబాద్‌లో ఈ నెల 11, 12వ తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు మునుగోడులోని మహాత్మ జ్యోతిబా పూలే విద్యాలయానికి చెందిన ఏడో తరగతి విద్యార్థిని తేజశ్రీ ఎంపికైంది. గతంలో జిల్లా స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన తేజశ్రీ అండర్-14 విభాగంలో పోటీలకు ఎంపికైంది. విద్యార్థినిని శుక్రవారం ఉపాధ్యాయులతో పాటు కోచ్ ప్రణీత్ అభినందించారు.